# గోళ్ళరంగు

– శంకరమంచి పార్ధసారధి

రోహిణీ కార్తి రంగుపూసుకున్న మిట్టమధ్యాహ్నం ఒంటిగంట వేళ సూర్యుడు అగ్నిగోళంలా మండిపోతున్నాడు.

ఆ ఎఱ్ఱని ఎండలో నర్సింలు రిక్షా తొక్కుతున్నాడు.

ఒళ్ళంతా చెమటలు దిగ్గారతున్నాయ్ – వేసుకున్న ఖద్దరు బనీను పూర్తిగా తడిసిపోయింది.

“ టైం ఎంతయ్యింది బాబయ్యా ? ” రిక్షా తొక్కుతూనే కూర్చున్న గిరాకీని అడిగాడు.

“ ఒంటిగంట ” గిరాకీ జవాబు.

ఇంక గుడిసెకి పోవాల, మల్లి ఎదురు చూస్తూ వుంటుంది అనుకున్నాడు నర్సింలు.

ప్రొద్దున్న ఏడింటికి సయ్యద్ షాపులో ఇన్ని టీ నీళ్ళుతాగి రిక్షా ఎక్కితే – ఆఫీసుల కెళ్ళేవాళ్ళని. స్కూళ్ళ కెళ్ళేవాళ్ళని దింపేసి. ఇంకా చిల్లర మల్లర గిరాకీలు చూసుకుని, ఒంటిగంటకి గాని గుడిసెకి చేరాడు నర్సింలు. అప్పటికే మల్లి, మావముందు రోజు సంపాదనతో నూకలు కొని వుడకేసి , నర్సింలు కోసం ఎదురుచూస్తూ ఉంటుంది. ఇదద్దరూ కల్సివున్నదేదో తిని కాసేపు కబుర్లాడుకుంటారు. మరికాసేపు సరసాలాడుకుంటారు మళ్ళీ మ్యాట్నీ సినిమాల వేళ నర్సింలు రోడ్డెక్కుతాడు రిక్షాతో సహా.

నర్సింలు రిక్షాని ఎఱ్ఱత్రికోణం ఆఫీసువద్ద ఆపాడు. రిక్షాలో కూర్చున్నవ్యక్తి దిగి డబ్బులిచ్చి వెళ్ళిపోయాడు. నర్సింలు ఒక్కసారి మొహానికి పట్టిన చెమటని తుడుచుకుంటూ ఎఱ్ఱత్రికోణం ఆఫీసు తాలుకు బోర్డువంక చూశాడు.

యాపిల్ పండులాంటి పసిపిల్లాడు నిండుగా నవ్వుతున్నాడు. నర్సింలుకి ఒక సారిగా మల్లి గుర్తుకొచ్చింది ఏదో ఆలోచనొచ్చింది. ముసి ముసిగా నవ్వుకొంటూ రిక్షాని గుడిసెవైపు తిప్పాడు.

తిన్నగా గుడిసె కెళ్ళిపోయి, గంజి తాగిం తర్వాత, తీరుబడిగా బీడీ ముట్టించి మల్లితో “ ఇదిగో చూడు ! కడుపుతో ఉన్నోళ్ళకి ఏవేవో కోర్కెలు పుడతాయంట, ఏందేందో తినాలంటుందంట. నీకేం అనిపించటంలా ? ” ఆసక్తిగా అడిగాడు.

ఆ మాట విన్న మల్లి సిగ్గుతో మెలికలారుతూ " ఛ ఫో ! పాడుమాటలు " అంది.

నర్శింలు బీడీదమ్ము గట్టిగాలాగి. " సిగ్గుపడమాక – పిచ్చి మొహమా ! ఏందైనా కావాలంటే అడిగెయ్ " అన్నాడు ఆప్యాయంగా.

మల్లి ఒక్కక్షణం కళ్ళెత్తి నర్శింలు మొహంలోకి చూసింది. అతడంటున్నది హాస్యానికి కాదని – తనపట్ల అతడికున్న ఆప్యాయత . అనురాగంతోనేనని నిర్ధారణ కొచ్చి, మెల్లిగా లేచి నర్శింలు పక్కకొచ్చి " మావా ! మరి నాకోటి కావాలి తెస్తావా " లాలనగా అడిగింది.

" ఏం కావాలి ? " ఆత్రంగా అడిగాడు.

మల్లి ఒక్కక్షణం తటపటాయించి మెల్లిగా.

" మావా.... మరి , మరే ...నాకెన్నాళ్ళ నించో కోరిగ్గా వుంది.... ఈ గోళ్ళకి రంగేసుకోవాలని.... మరి గోళ్ల రంగు సీసా తెస్తావా ? " శంఖులా పెరిగిన గోళ్ళవంక చూసుకుంటూ అంది.....

అది విన్న నర్శింలు పగలబడి నవ్వాడు. చేతిలో వున్న బీడీని అవతలకి గిరాటేసి " యెర్రి మొకమా ! ఆరంగులు, హంగులూ అందంలేని చెక్క బొమ్మలకి గాని, నీలాంటోళ్ళకి గాదే " అన్నాడు. మల్లివంక కొంటెగా చూస్తూ.

మల్లి కోపంతో మూతిని మూడు తిప్పులు తిప్పి " అంతేలే ! అడగమన్నావ్ – అడిగాక కాదంటున్నావ్ – అసలు నేనంటే నీకు పేమలేదు " అంది అలక నటిస్తూ.

నర్శింలు మళ్ళీ నవ్వాడు. " అది కాదే మల్లీ ! ఎవరాన్న పండడుగుతారు, మిఠాయి అడుగుతారు. కానీ ఇదేందో గోళ్ళరంగు మోజు అన్నాడు.

మల్లి ఇంకా కోపం నటిస్తూ " అవునయ్యా కొందరికి తింటే కడుపు నిండుద్ది – నా లాంటోళ్ళకి అడిగింది ఇస్తేనే కడుపు నిండిపోద్ది " అంది.

ఈసారి నర్శింలు నవ్వలేదు.

" సరేలే అట్లాగే కొనుక్కుందువుగానిలే " అనేసి బయటికొచ్చాడు

అతడి వెనుక మల్లి తృప్తిగా నవ్వుకుంది.

అట్టాగేలే అని అనడం అయితే అన్నాడు గానీ ఎట్టాగో ఎంత గింజుకున్నా అర్థం కాలేదు.

అప్పటికప్పుడే ఒక షాపులో అడిగాడు. ' గోళ్ళ రంగు ఖరీదెంద ' అని

మామూలయితే నాల్గురూపాయలు, ఇంకా మంచిదైతే అయిదు రూపాయలు

తను రోజంతా ఒళ్ళు హూనం చేసుకుని రిక్షా తొక్కినా, రిక్షా అద్దెపోను

ఏడురూపాయలకన్నా ఎక్కువ మిగలవు.

అందులో తన టీ ఖర్చులు, బీడీ ఖర్చుల్లాంటి సాదర పోగా అయిదు రూపాయలు మిగుల్తాయి.

అవి నూకలు కొనమని మల్లికిస్తాడు మరి అలాంటప్పుడు మల్లి కోరిక – అదే తను అడిగిన మీదట కోరింది ఎలా తీర్చటం ?

ఎన్నాళ్ళయినా ఇంతేగంద !

ఈ వూళ్ళో రిక్షా తొక్కేవాళ్ళు ఒక్కసారిగా పెరిగిపోయాడరు – రిక్షా ఎక్కేవాళ్ళు తనకోసం ధర్మ ప్రభువులైపోయి అడిగిందానికి రెట్టింపివ్వరు. అర్ధ రూపాయివ్వటానికి అరవైసార్లు ఆలోచిస్తారు !

మరి దాని ముచ్చట తీర్చేదెట్లా ?

అలా సందిగ్దంలోపడి కొట్టుకుంటున్న నర్సింలుకి ఒక అవకాశం తన్నుకొచ్చింది.

ప్రక్క వీధిలో వుంటున్న కోదండ రామయ్య గారనే అద్వకేటు ( పేరు కోదండ రామయ్యగాని మనిషి మాత్రం భీముడిలా వుంటారు ) మరుసటి రోజు నర్సింలుని కబురెట్టి పిలిపించి, “ రేయ్ నర్సిగా – బస్ స్టాండు దగ్గిర కళ్యాణ మండపంలో. ఈ రోజు వుదయం ఏడింటికల్లా రిక్షా తీసుకుని రావాలి. రాత్రి వరకు మాతనే వుండాలి. ఏవివ్వమంటావ్ ” అని అడిగాడు.

నర్సింలు గతంలో లాయర్‌గారి పిల్లల్ని స్కూలుకి తీసికెళ్ళి – తీసుకొచ్చేవాడు.

ఆ గౌరవంతో “ మీ యిష్టం బాబూ – మీకు తెల్దా ఏంటి నా రెక్కలకట్టం ” అన్నాడు.

“ సరే పదిహేనురూపాయలిస్తా – సరేనా ” అన్నారు నర్సింలు వంక సూటిగా చూస్తూ.

ఇంకా ఎక్కువ అడగాలనకున్నాడు. కానీ ఆయన కాదంటే తనకీ అవకాశం పోతుంది. అప్పుడు మల్లి కోర్కె తీర్చే అవకాశం తనకుండదు.

అందుక “ సరే బాబూ ” అనేశాడు. అనేసి రిక్షాతో సహా గాల్లో తేల్తూ గుడిసెకెలి. మల్లికి విషయం చెప్పి “ ఆళ్ళి చ్చే డబ్బులో ఆ రంగేందో కొనుక్కో ” అని ప్రకటించేశాడు.

మొగ్గాలాంటి మల్లి మొహం ఆనందంతో వికసించింది.

శనివారం రానేవచ్చింది.

ఆరోజు మామూలుగా రిక్షా తీసుకుని బయల్దేరాడు నర్సింలు. టీ దుకాణంలో

కాసిని టీ నీళ్ళు తాగి, ఒక బీడీ కట్ట కొనుక్కుని లాయర్ గారింటికెళ్ళాడు.

అప్పటికే ఆయన ఓడిపోయిన క్లైంటు ఫీజివ్వకుండా వెళ్ళిపోయినట్టుగా కంగారడిపోతున్నారు – నర్శింలు ఇంకా రాలేదని. నర్శింలుని చూడంగానే " వచ్చేవా పద పదా ఇప్పటికే ఆలస్యమైంది. అంటూ రిక్షా నిండా సామాను పేర్చి తనూ చతికిల పడ్డాడు చలిమిడి ముద్దలా.

రిక్షా కదిలింది.

అలా కదిలిన రిక్షాని .తొక్కుతున్న నర్శింలుకి మధ్యాహ్నం రెండింటి వరకు తీరక లేకుండా పోయింది.

పెళ్ళికొచ్చిన చుట్టాలు ఎప్పుడూ రిక్షా మొహం చూడనట్లు ఎక్కి కూర్చుని రోడ్లన్నీ తిప్పించారు.

లేదంటానకి వీల్లేదు. కాంట్రాక్ట్ బేరం !

" నేను కారువంక, ఇమానం వంక చూసినట్లు . ఈళ్ళు నా రిక్షా వంక చూత్తుండారు – ఏడనుంచి వూడిపడ్డారో ఈళ్ళంతా " అనుకున్నాడు కసిగా.

మధ్యాహ్నం రెండయింది.

పెళ్ళి వారింట్లో భోజనాలవుతున్నాయి.

రిక్షాకి కాస్త రెస్ట్ దొరికింది. నర్శింలుకి ఆకలి దంచేస్తోంది.

కూటికి గుడిసెకి పోవాలో, లేక ఈళ్ళు పెడతారో అర్థం కాలేదు.

అలాగే ఎదురు చూస్తూ కూర్చున్నాడు చాలాసేపు.

కాని ఎవ్వరూ అతడిని గూర్చి పట్టించుకోలేదు.

" ఈ పాటికి మల్లికూడ కూడు తినేసేవుంటుంది. పొద్దున్న వచ్చే టప్పుడు చెప్పే వచ్చాడు. నేను ఇయ్యాల పెళ్ళోరింట్లో భోంచేత్తానని ".

ఇంక లాభం లేదని వెళ్ళి ఇంత రొట్టె తిని టీ నీళ్ళు తాగేసి వద్దాం అనుకుంటుండగా, పెళ్ళి వారి భోజనాలయిపోయి. బిల బిలమంటూ బొజ్జలు నిమురుకుంటూ వచ్చి రిక్షాలో కూలబడి " విడిదికి పోనియ్ " అన్నారు.

విడిందింటికి పెళ్ళి వారింటికి మధ్య మళ్ళీ నర్శింలుకి త్రిప్పటం మొదలైంది.

పెళ్ళికొచ్చిన వారిలో ఒక లావుపాటి ఆవిడ ( ఆవిడ పేరు గాని, పెళ్ళి కుమారుడికి ఏమౌతుంతోగాని తెలీదు నర్శింలుకి ) రిక్షాలో విపరీతంగా తిరిగేస్తోంది. ఆవిడ సంతానాన్ని రవాణా చేయటానికే మూడు ట్రిప్పులు వెయ్యాల్సొచ్చింది – " మా తల్లి మీలాంటోళ్ళకి రిచ్చాకన్నా లాగుడుబండయితే బాగుంటాది " అని చెప్పాలనుకున్నాడు

" రేయ్ నర్శింలు పిల్లని కాస్త రిక్షాలో కూర్చోపెట్టి తిప్పుతూ వుండు. నే వెళ్ళి చీర మార్చుకొస్తా " అంది ముప్పయి ఆరోసారి రిక్షాదిగి పిల్లని నర్శింలు కందిస్తూ లావుపాటి పిన్నిగారు.

" తల్లీ నీ బేరానికో దణ్ణం " అని వెళ్ళిపోదాం అనుకున్నాడు.

కాని మల్లి గుర్తుకొచ్చింది. దాని ముచ్చట జ్ఞాపకానికొచ్చింది.

కిక్కురుమనకుండా పిల్లనందుకొని రిక్షాలో కూలేసి తను రిక్షా ఎక్కాడు.

అలా రాత్రి పదింటిదాకా విరమాం లేకుండా రిక్షాని తొక్కుతూనే వున్నాడు.

ఒళ్ళు హూనం అయిపోయింది. ఒంట్లో సత్తువైపోయింది. పొద్దున తాగిని టీ నీళ్ళు తప్ప పచ్చిగంగ కూడా ముట్టలేదు. కళ్ళు తిరుగుతూన్నట్లుగా అనిపించింది. పిన్నిగారి ఫ్యామిలీని పెళ్ళి వారింటికి తీసుకొస్తున్న నర్శింలుకి.

వాళ్ళ నక్కడ దింపేసి చివరి బీడీని వెలిగించాడు.

బీడీని ఒక దమ్ములాగాడో లేదో – సుడిగాలిలా వచ్చింది పిన్నిగార వెనక్కి తిరిగి.

" రేయ్ నర్శింలూ ! అమ్మాయి కాలి పట్టా రిక్షాలో పడిందేమో చూడు " అంటూ

నర్శింలు ఒక్కసారిగా రిక్షాలోను. సీటు క్రింద, పక్కల్ని చూసి " లేదండీ " అన్నాడు.

" అయ్యో అదేమిట్రా. రిక్షాలో కూర్చున్నప్పుడు గూడా ఉందిరా. దిగి లోపలికెళ్ళాను కనిపించడంలేదు. ....తిన్నగా చూడ్రా " పెద్దగా అరుస్తోంది.

అప్పటికే పెళ్ళి జనం మెల్లిగా రాసాగారు.

పిన్నిగారు అరుస్తోంది – నర్శింలు మెల్లిగా " రిక్షాలో పడలేదండి " అంటున్నాడు. చుట్టూ మూగిని జనం అందరూ తలోమాట అంటున్నారు.

ఈ గొడవ లోపల్నించి కోదండరామయ్యగారొచ్చి, విషయం విన్నాక నర్శింలుని చూసి " అలా గుడ్లప్పగించి చూస్తావేరా, తిన్నగా వెతుకు " అన్నారు కోపంగా.

" ఇంతవరకు పెళ్ళి సవ్యంగా ఏ మాట పలుకులేకుండా అయిపోయింది, ఇప్పుడు ఈ చిన్న విషయం వల్ల తనకి అప్రతిష్ట రాకుండా చూసుకోవాలి " అనుకొన్నాడు లాయరు గారు మౌనంగా.

" చిత్తం చూశానండి – రిచ్చాలో పడలేదండి " అన్నాడు వినయంగా నర్శింలు.

" ఏడ్చావ్ రిక్షాలో కాకపోత ఏఇంకెక్కడ పడుతుంది – తిన్నగా చూడు "

" లేదండి అంతా వెతికే చెబుతున్నానండి – రిచ్చాలో మాత్రం పడలేదండి. "

" అయ్యో లేదన్నయ్యగారు – రిక్షాలో వస్తున్నప్పుడు కూడా ఉంది – దిగి అలా లోపలికొచ్చాను, అంతే కన్పించలేదు "

పిన్నిగారు విన్నవించుకొన్నారు.

విన్న కోదండరామయ్యగారు నర్శింలు వంక చూసాడు. నర్శింలుకి కంగారు పుట్టింది. " నాకు తెల్దండి సత్తెపెమానకంగా నాకు తెల్దండి " భయంగా అన్నాడు.

వీడికంగారు చూసి లాయయరుగారి చూపుల్లో అనుమానం బలపడింది.

కోపంతో బుసలు కొట్టసాగారు.

మగపెళ్ళి వారిలోంచి ఎవరో అన్నారు " రెండు తగిలించండి. వెధవ వాడే చెపుతాడు " అని.

కోదండరామయ్యగారు చొక్కా పైకి మడిచి. " రేయ్ గాడ్దికొడకా తెలిసిన వాడివని పిలిస్తే ఇదట్రా నువ్వు చేసేది .... చెప్పు ఎక్కడ దాచావో ? " నర్శింలు చొక్కాని రెండు చేతుల్తో పట్టుకుని గుంజుతూ అన్నారు.

" బాబూ నిజంగా నాకు తెల్దండి. రిచ్చాలో పడలేదు బాబూ " భయంతో వణికిపోతూ అన్నాడు.

" రాస్కెల్ చెప్పు ఎక్కడ దాచావో ? " బలంగా గుంజి వెనక్కి తోశాడు.

నర్శింలు వెళ్లి పందిరి గుంజలకి కొట్టుకుని కింద పడ్డాడు.

అతడి తల బలంగా పందిరి స్తంభానికి కొట్టుకుంది.

అదే అదునుగా అందరూ తలో తన్ను తన్నారు.

నర్శింలు ఏడుస్తూ " నాకు తెల్దుబాబు " అంటున్నాడు.

ఆ దశలో లావుపాటి పిన్నిగారికి గుర్తొచ్చినట్టుంది. ఇందాకా పిల్ల కాలికున్న పట్టాని వూడదీసి తన చీరకొంగున కట్టుకున్నది.

అందకే చీర కొంగుని ఎవ్వరికీ కన్పించకుండా బొడ్లో దోపుకుంటూ " పోన్లేరా అబ్బాయిలు – పోతేపోయింది వెధవపట్టా – వాడి పాపానవాడే పోతాడు వాడ్ని పోనీ యండి " అని అందర్నీ సర్దింది.

కోదండరామయ్యగారు మళ్లీ కోపంగా ముందుకువచ్చి. " ఫో దొంగ వెధవా – బతికి పోయావ్ – నీ ముఖం నాకు చూపించక పో అవతలకి " అంటూ ఒక నెట్టు నెట్టాడు.

జనం మెల్లి మెల్లిగా తప్పుకున్నారు.

పిన్నిగారు, లాయర్ గారు కూడా లోనికెళ్ళిపోయారు.

నర్శింలు లేని ఓపికని తెచ్చుకుని లేచి నిలబడ్డాడు.

కళ్ళు తుడుచుకున్నాడు.

పెళ్ళివారి ఇంటివంక అసహ్యంగా చూసాడు.

దెబ్బ తగిలనిచోట కాస్త మంటగా అనిపించింది.

కానీ లెక్కపెట్టక బయటికొచ్చి. రిక్షా చేత్తో పట్టుకుని గుడిసెవేపు కదిలాడు.

పరువు పోయింది – రావాల్సిన డబ్బుపోయింది – ఒంట్లో ఓపిక పోయింది – అన్నీ పోయాయ్.

కానీ ఒకటే తృప్తి – తనే పాపం ఎరుగడు – తను దొంగ కాదు – దొరే !

వెనక్కి వెళ్ళి అక్కడున్న వాళ్ళందరికీ చెప్పాలనుకున్నాడు.

" బాబూ నేను దొంగని కాదు – దోచే అలవాటుంటే నేనూ రిచ్చాలో కుర్చునే వాడిని – ఇలా రిచ్చా తొక్కేవాడిని కాను " అని.

కాని అతడి ఒంట్లో ఓపికలేదు. కళ్ళు తిరుగుతున్నాయి.

గుడిసెకి చేరి రిక్షాని అవతలకి నెట్టి లోనికెళ్ళి మంచంమీద పడిపోయాడు.

మల్లి ఆత్రంగా దగ్గిర కొచ్చింది." మావా వుడుకు నీళ్ళేటనా " అంది.

కాని నర్సింలు ఏం మాట్లాడలేదు.

దగ్గిరకొచ్చి ఆప్యాయంగా ప్రక్కలో కూర్చుని " మవా అలసి పోయావా – నా గురించేకదూ నువ్వింత కట్టపడుతున్నావ్ " అంటూ చేతివేళ్ళని అతడి జుట్టులోనికి పోనిచ్చింది. కాని పాముని ముట్టుకున్నట్టుగా చేతిని వెనక్కి లాక్కుంది.

చేతికి వెచ్చగా జిగటగా ఏదో అంటింది. చటుక్కున లేచి కోడిగుడ్డు దీపం తెచ్చి పరీక్షగా చూసింది.

అది మావ నెత్తురు !

ఒక్కసారి భయంగా అరిచింది.

పడుకున్న నర్సింలు కళ్ళు తెరిచి చూశాడు.

ఆ గుడ్డి వెలుగులో తన రక్తంతో తడిసిన ఆమె గోళ్ళు ఎర్రరంగేసుకున్నట్టుగా కన్పించాయ్ నర్సింలుకి.

నిస్సహాయంగా, నీరసంగా నవ్వి మళ్ళీ కళ్ళు మూసుకుని పడుకున్నాడు.

అలా పడుకున్న అతడి మొమంలో – వాళ్ళ జీవితాల్లోలాగా ఏ రంగులూ లేవు.

**------- అయ్యిపోయింది -------**